క్లుప్తంగా

విజయదశమికి ఏర్పాట్లు

ఆమనగల్లు: దసరాను పురస్కరించుకుని పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ అన్నారు. కొనసాగుతున్న పనులను వైస్ చైర్మన్ దుర్గయ్య, బీజేపీ నాయకుడు గోరటి నర్సింహులుతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం రాంపాల్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్నట్లుగా.. ఈ ఏడు ఉత్సవ ఏర్పాట్లు చేయిస్తున్నామని, రచ్చకట్ట వద్ద పూజల అనంతరం ఊరేగింపుగా కాలేజీ గ్రౌండ్‌లో సంబురాలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

జానారెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు



జానారెడ్డితో అనంతరెడ్డి, కేశవులు

ఆమనగల్లు: మాజీ హోంమంత్రి కుందూరు జానారెడ్డిని గురువారం కాంగ్రెస్ ఆమనగల్లు పట్టణ నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు కలిసి సత్కరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన 20 చెక్కులను, గురువారం పట్టణంలోని కేడీఆర్ కాలేజీలో లబ్ధిదారులకు పార్టీ మండల అధ్యక్షుడు జగన్, మాజీ అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు మానయ్యలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటరమణారెడ్డి, ఖలీల్, కృష్ణ నాయక్, శ్రీధర్, ఖాదర్, అలీం, ఖాదర్‌ఖాద్రి, రామకృష్ణ, మెకానిక్ బాబా, ప్రసాద్, కరీం, రహీం, శ్రీకాంత్, నాజర్, మహేశ్, మల్లయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మున్సిపల్ సిబ్బందికి దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం పట్నంలోని ప్రజాభవన్‌లో 101 మందికి రూ.33.16లక్షల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురునాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కోడూరి రమేష్, శశాంకరెడ్డి, శివ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ..

దసరా కానుకగా మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి.. ప్రజాభవన్‌లో దుస్తులు పంపిణీ చేశారు. ఇందులో మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్ పర్సన్ బర్ల మంగ, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

గ్రామంలో బ్యాంక్ ఏర్పాటు చేయాలి

ఎంపీ మల్లు రవికి వినతి



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల పరిధి గట్టుఇప్పలపల్లిలో బ్యాంక్ ఏర్పాటు చేయాలని ఆ గ్రామ నాయకులు కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఎంపీ మల్లు రవిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మండలంలోనే గట్టుఇప్పలపల్లి పెద్ద గ్రామమని, బ్యాంకు లేక రైతులు, వ్యాపారులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. బ్యాంకు పనుల నిమిత్తం కల్వకుర్తి పట్టణానికి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో బ్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంద్రకంటి శివ కుమార్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.



ఆమనగల్లు: దుర్గాదేవి అలంకరణలో కన్యకా పరమేశ్వరిదేవి



ఇబ్రహీంపట్నం: దుర్గామాతగా రాజరాజేశ్వరి



కడ్తాల్: మైసిగండిలో దుర్గాదేవిగా అన్నపూర్ణేశ్వరి



యాచారం: నందివనపర్తిలో మహాదుర్గాదేవిగా సరస్వతీ

అమ్మ దుర్గమ్మ.. మమ్మేల రావమ్మా

- కొనసాగుతున్న దేవీశరన్నవరాత్రోత్సవాలు
- దుర్గామాతగా భక్తులను అనుగ్రహించిన అమ్మవారు
- ప్రత్యేక పూజలు చేసిన భక్తజనం



ఆమనగల్లు: మార్కండేయ దేవాలయంలో..

ఆమనగల్లు/ఇబ్రహీంపట్నం/కడ్తాల్/యాచారం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజైన గురువారం ఆమనగల్లు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి, భక్తమార్కండేయస్వామి దేవాలయంలో దుర్గమ్మగా రాజరాజేశ్వరిదేవి, కడ్తాల్ మైసిగండి, శివరామాలయంలో దుర్గాదేవిగా అన్నపూర్ణేశ్వరి, ఇబ్రహీంపట్నం ఈశ్వరాంజనేయ ఆలయంలో దుర్గామాతగా రాజరాజేశ్వరి దేవి, యాచారం నందివనపర్తిలో మహాదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమనగల్లు కన్యకా పరమేశ్వరీ సన్నిధి పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ్మ, కోశాధికారి శ్రీనివాస్, నాయకులు అంజయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మైసిగండిలో..

కడ్తాల్ మండలం మైసిగండి, శివరామాలయంలో దుర్గాదేవిగా అన్నపూర్ణేశ్వరి భక్తులను అనుగ్రహించారు. నవరాత్రులను పురస్కరించుకుని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కలశ, విశేష పూజలు, యజ్ఞం, చండి హోమం, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలి, ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు. మండల కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ పూజలు చేశారు. ఇందులో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణగుప్తా తదితరులు ఉన్నారు.

నందివనపర్తిలో..

యాచారం మండలం నందివనపర్తి గ్రామంలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు మహాదుర్గాదేవి అవతారంలో భక్తులను అనుగ్రహించారు. ఆలయ పూజారి రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవిని దర్శించుకున్నారు.



ఇబ్రహీంపట్నం: బృందావన్ కాలనీలో..

ఆంజనేయ స్వామి సన్నిధిలో..

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడ గ్రామ సంరక్షణ ఆంజనేయ స్వామి దేవాలయంలో కొలువైన దుర్గామాత సన్నిధిలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ నేత, రాజవర్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: అమ్మవారి సన్నిధిలో హోమం చేస్తున్న ఆర్యవైశ్యసంఘం నాయకులు



ఆమనగల్లు: అమ్మవారి పూజలో భక్తులు



తుర్కయంజాల్: అమ్మవారి సన్నిధిలో భక్తులు



కడ్తాల్: దుర్గా మాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తిభావం పెంపొందించుకోవాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

తలకొండపల్లి: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. మండల పరిధి రామకృష్ణాపురంలో ముత్యాలమ్మ దేవాలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను ఆయన దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే ఏకాగ్రత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు.

ఆలయ ముఖద్వారం శంకుస్థాపన

ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో దేవాలయ ముఖద్వారాన్ని శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసురెడ్డి రూ.20 లక్షలు సొంత నిధులతో నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ముఖద్వార నిర్మాణ పనులను పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం మాదాయిపల్లి దుర్గమాత పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీఓ శ్రీకాంత్, శ్రీశైలం, శ్యాంసుందర్‌రెడ్డి, అంజిరెడ్డి, బాల్‌రెడ్డి, కోటిరెడ్డి, రాఘవరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, జగ్గారెడ్డి, ఆంజనేయులు, రవి, మాధవ్, మాధవులు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం

తలకొండపల్లి: హిందూ ధర్మ పరిరక్షణే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని పాలమూరు విభాగ్ సంఘచాల, న్యాయవాది శ్రీనివాసురెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వారం రోజులుగా నిర్వహించిన ప్రాథమిక శిక్షావర్గ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ పద సంచాలనం, కార్యకర్తలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసురెడ్డి మాట్లాడుతూ.. చిన్న వయస్సు నుంచే హిందూ సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంచాలక్ నారాయణ, కార్యవహ ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



పారిశుద్ధ్య కార్మికులకు చీరలు అందజేస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

- ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి
- కార్మికులకు చీరల పంపిణీ



కార్మికులతో కలిసి భోజనం చేస్తున్న నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండగని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. పుర కార్యాలయంలో గురువారం మహిళా కౌన్సిలర్లు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆయన బతుకమ్మ ఆడిపాడారు. కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సొంత ఖర్చుతో కార్మికులకు పట్టు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. పండగ పూట అందరూ బాగుండాలనే ఉద్దేశంతో చీరలు పంపిణీ చేశామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాల్లో రూ.6వేలు అందజేసినట్లు పేర్కొన్నారు. బదిలీపై వెళ్లిన ఇంజినీర్ వీరాంజనేయులును సన్మానించారు. పుర వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు లావణ్య, మౌనిక, లావణ్య, కలమ్మ, కోఆప్షన్ సభ్యుడు గోపాల్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఎంపీపటేల్‌గూడ పీఏసీఎస్ చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి బొంగ్లూర్‌లో నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ద్వారా రైతులకు రూ.2 కోట్లు ఇవ్వడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పోచారంలో నిర్మించిన గోదాంను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి, సంఘం అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ యాదయ్య, యాదమ్మ, బాల్‌రెడ్డి, యాదమ్మ, శ్రీశైలం, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మహేందర్‌రెడ్డి

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

- పేదలకు ఖరీదైన వైద్యం చేయించేందుకు ఎన్ని నిధులైనా వెచ్చిస్తాం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- 40 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కడ్తాల్: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 40 మంది బాధితులకు రూ.50 లక్షలకు పైగా విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తుండగా, అధికారం దక్కలేదనే అక్కసుతో ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు బాలరాజు, నాయకులు రామకృష్ణ, లక్ష్మయ్య, రాంచందర్‌నాయక్, జహంగీర్‌బాబా, జహంగీర్‌అలీ, మల్లేశ్‌గౌడ్, యాదయ్య, భిక్షపతి, రాజేందర్, నరేందర్‌నాయక్, లక్ష్మణ్, వీరయ్య, రాజేశ్, శాబుద్దీన్, ఇమ్రాన్‌బాబా, మహేశ్, పత్యా తదితరులు పాల్గొన్నారు.



యాచారం: కుర్మిద్దలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చిత్తూ చిత్తూల బొమ్మ..

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

సద్దుల బతుకమ్మ సంబురాలు వైభవంగా జరిగాయి. ఎనిమిది రోజుల పాటు రోజుకో రూపంలో కొలిచిన అమ్మవారిని.. తొమ్మిదో రోజైన గురువారం మహిళలు సద్దుల బతుకమ్మగా ఉత్సవం నిర్వహించారు. తీరొక్క పూలతో సింగిడిని తలపించే గోపురాలను పేర్చి, ఆపై గౌరమ్మను ప్రతిష్ఠించిన ఆడపడుచులు.. అమ్మవారికి నైవేద్యంగా సత్తుపిండి, పెరుగన్నం, మలిద ముద్దలను సమర్పించారు. సంధ్యాసమయాన కూడళ్లలో బతుకమ్మలను ప్రతిష్ఠించి, పూల సంబురం అంబరాన్నంటేనా ఆడిపాడారు. 'చిత్తూ చిత్తూల బొమ్మ శివుని ముద్దులగుమ్మ. బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన' అంటూ లయబద్ధంగా పాడుతూ.. 'తంగేడు పూవల్ల చందమామ.. బతుకమ్మ పోతుంది చందమామ. పోతె పోతివిగాని చందమామ.. మల్లెన్నడొస్తావు చందమామ. యాదాదికోసారి చందమామ.. నువ్వొచ్చి పోవమ్మ చందమామ' అంటూ బతుకమ్మను గంగమ్మ ఒడికి సాగనంపారు. అనంతరం ఇస్తినమ్మ వాయినం.. పుచ్చుకుంటినమ్మ వాయినం అంటూ.. వెంటతెచ్చుకున్న ప్రసాదాన్ని ఒకరినొకరు పంచిపెట్టుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆమనగల్లు: బతుకమ్మల ఊరేగింపు



ఇబ్రహీంపట్నం: బృందావన్ కాలనీలో..



యాచారం: నక్కర్తమేడిపల్లి ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో..



ఇబ్రహీంపట్నం: మహంకాళి ఆలయ ప్రాంగణంలో..



కడ్తాల్: బతుకమ్మలతో అతివలు



మాడ్గుల: బతుకమ్మతో ఎంపీడీఓ పద్మావతి తదితరులు



తలకొండపల్లి: దేవుని పడకల్‌లో..



ఆమనగల్లులో..



అబ్దుల్లాపూర్‌మెట్: గౌరెల్లిలో బతుకమ్మ సంబురాలు